హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో జైపాల్ రెడ్డి పాత్ర కీలకం

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి మెట్రో రైలు ప్రాజెక్టు తీసుకు రావడంలో దివంగత కేంద్ర మాజీ మంత్రి, ఎస్.జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని మెట్రో ఎం.డీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో ఆయన సమాధి వద్ద పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును అప్పటి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆ సమయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులతో పాటు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు ఆమోదింపజేశారు. అలాగే మెట్రో రైలు ప్రాజెక్టులో స్టాండర్డ్ గేజ్‌ను అనుసరించాలనే విధానానికి భారతీయ రైల్వే వ్యతిరేకించడంతో దేశంలోని ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టులు గేజ్ సమస్యపై నిలిచిపోయాయి. దానిపై జైపాల్ రెడ్డి తీసుకున్న చొరవతోనే హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టులు విజయవంతంగా చేపట్టడానికి కారణమైందని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

బాధితుడి వద్ద లభించిన నగదు అప్పగించిన 108 సిబ్బంది వెంకటేశ్

108 సిబ్బంది నిజాయితీ

అమీర్‌పేట్, జనవరి 16 : రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి వద్ద లభించిన నగదును నిజాయితీగా అప్పగించారు 108 ఆంబులెన్స్ సిబ్బంది. సోమవారం ఎర్రగడ్డ ఫ్లై ఓవర్‌పై ఓ బైక్ యాక్సిడెంట్ జరిగింది. వెంటనే అక్కడికి చేరుకున్న 108 అత్యవసర సిబ్బంది ప్రమాదంలో గాయపడిన తిరుపతయ్య అనే బాధితుడికి ప్రథమ చికిత్స అందజేశారు. అదే సమయంలో అతడి వద్ద లభించిన రూ.68,500 నగదు, బైక్, సెల్‌ఫోన్‌లను తిరుపతయ్య బంధువులను పిలిచి అప్పగించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి, బాధితుడి వద్ద లభించిన నగదును అప్పగించిన 108 సిబ్బంది వెంకటేశ్, వెంకటరమణలను పలువురు అభినందించారు.

21న లవ్ మై ఇండీ డాగ్ షో

ముషీరాబాద్, జనవరి 16 : బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 21న పెంపుడు కుక్కల కోసం లవ్ మై ఇండీ డాగ్ షో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ అమల అక్కినేని ఒక ప్రకటనలో తెలిపారు. జంతు సంక్షేమ సంస్థల్లో ఒకటైన బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ రెండవ ఎడిషన్ ఇండీ డాగ్ షోను 21న దోమలగూడ రామకృష్ణ మిషన్ పక్కన ఉన్న చైతన్య విద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు జంతువులకు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడం తమ ఉద్దేశ్యమని మార్స్ పెట్ కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి తెలిపారు.

ఓటీపీ చెప్పారంటే..

ఖాతాఖాళీ

సైబర్ నేరగాళ్లు చేతితో డబ్బులు పోగొట్టుకున్నా..

సైబర్ నేరగాళ్ల చేతిలో 2లక్షల 21వేలు పోగొట్టుకున్నా. డిసెంబర్ 31న హైదరాబాద్ వెళ్లా. అక్కడే నా ఫోన్‌ను కొట్టేసిన సైబర్ నేరగాళ్లు ఫోన్‌పే ద్వారా 2లక్షల 21వేలు డ్రా చేసుకున్నారు. వెంటనే సైబర్ సైబర్ క్రైమ్‌కు సమాచారం ఇచ్చినా, పోలీసులను ఆశ్రయించినా, మొబైల్ సిమ్‌ను కొత్తది తీసుకున్నా లాభం లేకుండా పోయింది. ఫోన్ ద్వారా నా ఖాతాలో ఉన్న డబ్బులను ఖాళీ చేశారు. ఫోన్ కొట్టేసిన ఒక్క రోజులోనే నా డబ్బులను నేరగాళ్లు కొట్టేశారు. డబ్బులను సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే విధంగా సైబర్ క్రైమ్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎర్ర విష్ణువర్ధన్‌రెడ్డి, కులకచర్ల

బ్యాంకు సిబ్బంది పాస్‌వర్డ్ అడగరు..

బ్యాంకు సిబ్బంది పాస్‌వర్డ్ ఎప్పుడూ అడగరు. బ్యాంకులో నగదు లావాదేవీల్లో జాగ్రత్తగా ఉండాలి. ప్రతి లావాదేవీల్లోనూ అప్రమత్తంగా ఉంటేనే నేరాలు తగ్గించడం జరుగుతుంది. ఏ బ్యాంకు అధికారైనా పాస్‌వర్డ్ వివరాలు చెప్పాలని అని అడిగితే ఎందుకని ప్రశ్నించాలి. ఎలాంటి అనుమానం వచ్చినా నేరుగా బ్యాంకుకు వెళ్లి ఖాతాను సరిచూసుకోవాలి. వివరాలు తెలుసుకొని మీ ఖాతాలో ఉన్న నగదు విత్‌డ్రా చేస్తే వెంటనే సమాచారం అధికారులకు తెలుపాలి. ఫోన్ పోయిన వెంటనే ఖాతాలో ఉన్న డబ్బులను హోల్డ్‌లో పెట్టించాలి. లేదంటే ఖాతాను బ్లాక్ చేయించాలి.

- శ్రీశైలం, ఎస్ఐ కులకచర్ల

- ఏటీఎం కార్డు నంబర్ చెబితే నగదు పోయినట్లే..
- పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలి
- నెట్, మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు చేస్తే జాగ్రత్తలు పాటించాలి
- ఖాతాకు సంబంధించిన వివరాలు చెప్పకూడదు..
- బ్యాంకు సిబ్బంది ఖాతా వివరాలు ఫోన్‌లో అడగరు
- మోసానికి గురైతే 1930కు సమాచారం ఇవ్వాలి

కులకచర్ల, జనవరి 16 : పెరుగుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఆర్థిక నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకొని బ్యాంకు ఖాతాలో ఉన్న నిల్వలను ఖాళీచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు చాలావరకు అనునిత్యం జరుగుతున్నాయి. ఆధునిక యుగంలో పెరుగుతున్న విలాసాలకు అనుగుణంగా అక్రమ విధానంతో సులభంగా డబ్బులు సంపాదించుకోవాలనుకునే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా తప్పనిసరి కావడంతో బ్యాంకు ఖాతాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తాజాగా వచ్చిన నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలని ఖాతాల ద్వారానే నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ప్రభుత్వాలు, బ్యాంకులు తెలియజేస్తున్నాయి. దీనికి గాను ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను తెరిచారు. దీంతో ఏటీఎం యంత్రాలు భారీగా ఏర్పాటు చేశారు. ఏటీఎంలలో నిత్యం రూ. కోట్లాది రూపాయల నగదు లావాదేవీలు ఏటీఎంల ద్వారా డ్రా చేస్తున్నారు. దీంతో పాటు బ్యాంకు అధికారులు మొబైల్ నెట్, నెట్ బ్యాంకింగ్ సౌకర్యం కూడా కల్పించారు. ఆర్థిక లావాదేవీలు నగదురహితంగా ఉండేందుకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంలతో పలువిధాలైన సౌకర్యాల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అవకాశం లభించింది. ఖాతాదారులకు ఇచ్చిన పాస్‌వర్డ్‌ల రక్షణలో ఖాతాదారులు అప్రమత్తంగా లేకపోవడంతో ఎంతో మంది మోసగాళ్ల చేతిలో నష్టపోతున్నారు. ఖాతాదారులకు ఫోన్ చేసి బ్యాంకు అధికారుల మంటూ నమ్మించడం, వెంటనే ఖాతా నంబర్, ఏటీఎం కార్డు వివరాలు తెలుసుకొని నిమిషాల్లో బ్యాంకుఖాతాల్లో ఉన్న డబ్బులు ఖాళీ చేస్తున్నారు. కొన్ని లింకులను ఖాతాదారులకు పంపించి వాటిపై క్లిక్ చేసిన వెంటనే ఆఫోన్‌నుండి నేరగాళ్లకు ఓటీపీ వెళ్లి క్షణాల్లోనే ఖాతాల్లో డబ్బులు ఖాళీ అవుతున్నాయి.

ఏటీఎం కార్డు నంబర్ గోప్యంగా ఉంచుకోవాలి..

బ్యాంకు ఖాతాదారులు ఏటీఎం కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఏటీఎం కార్డు మీద ఉండే నంబర్ కీలకం. బ్యాంకు ఖాతా నంబర్, పిన్ నంబర్, కార్డు వెనుకల ఉండే మూడంకెల సీవీవీ సంఖ్య తెలిస్తే చాలు.. ఖాతా నుంచి సొమ్మును దోచుకోవడం జరుగుతుంది.

ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు..

ఖాతాదారులు తమ ఖాతాకు సంబంధించిన డబ్బులు డ్రా చేసుకోవడానికి ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయాలంటే తప్పనిసరిగా ఓటీపీ నమోదు చేయాల్సి ఉంటుంది. అలా అని ఓటీపీ ఎవరికంటే వారికి చెబితే వారి ఖాతాలు కూడా ఖాళీ అవుతాయి.

జాగ్రత్తగా ఉంటేనే మేలు...

ఇటీవల ఎక్కువగా ఏటీఎం కార్డు నంబర్లు తెలుసుకొని నగదును అపహరణ చేస్తున్నారు. ఏటీఎం కేంద్రాలతో పాటు ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో కార్డుల క్లోనింగ్ చేసి మోసం చేస్తున్నారని సమాచారం. ఏటీఎం కార్డుల పూర్తి సమాచారం అపహరిస్తున్నారు. పిన్ కోడ్ నమోదు చేసే సమయంలో నంబర్ పడేలా సీసీ కెమెరాలు ఉంచుతారు. ఏటీఎం కేంద్రాల వద్ద పరిచయం లేని వ్యక్తుల మధ్య వినియోగించకపోవడమే మంచిది.

ఆన్‌లైన్ ద్వారా చాలా మోసాలు..

ఆన్‌లైన్ ద్వారా చాలా మోసాలు జరుగుతున్నాయి. వాట్సాప్‌లకు వ్యక్తిగతంగా లింకులు పంపి వాటిని ఓపెన్ చేస్తే ఖాతాల్లోకి డబ్బులు వచ్చి పడతాయని, ఓటీపీ నమోదు చేయాలని సైబర్‌నేరగాళ్ల ఫోన్‌లు చేస్తుంటారు. సైబర్ నేరగాళ్లు మీ ఖాతా బ్లాక్ అవుతుంది. యూనో యాప్ బ్లాక్ అవుతుంది వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని, ఓటీపీ నమోదు చేయాలని తెలియజేస్తూ వేలకొద్ది డబ్బులను బ్యాంకు ఖాతాల నుంచి కొట్టేస్తున్నారు.

లోన్లు ఇస్తామంటూ..

లోన్ ఇస్తామంటూ ఒక వ్యక్తి ఫోన్ చేస్తాడు. వాట్సాప్‌లో డాక్యుమెంటు పంపించాలని అడుగుతారు. తీరా పంపించాక ఓటీపీ చెప్పమని అడుగుతారు. ఓటీపీ నంబర్ చెప్పాక ఖాతాలో ఉన్న డబ్బులు డ్రాచేసుకుంటారు. సైబర్ నేరగాళ్లు వాడే ఫోన్లు సైతం ఫేక్ ఐడీలతో ఉండటంతో కేసులను ఛేదించడం ఇబ్బంది కరంగా మారుతుందని పోలీసులు చెబుతున్నారు.

ఫిషింగ్ ద్వారా.. వినియోగదారుడి పేరు పాస్‌వర్డ్ క్రెడిట్ కార్డు వివరాలను సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి చేసే నేరాన్ని ఫిషింగ్ అంటారు. విశ్వసనీయ సంస్థగా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లను వ్యక్తిగా మారు వేషాల ద్వారా మోసాలకు పాల్పడుతుతారు.

1930సైబర్ క్రైమ్‌కు సమాచారం ఇవ్వాలి..

ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే తెలంగాణ సైబర్ క్రైమ్‌కు 1930కు సమాచారం అందించి వివరాలు తెలియజేయాలి. వెంటనే డబ్బులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని సైబర్‌నేరగాళ్ల ఖాతాల్లోనుంచి పూర్తి స్థాయిలో డబ్బులు తీసుకోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటారు. ఖాతాలో నుండి పోయిన సైబర్‌నేరగాళ్ల ఖాతాలను హోల్డ్‌లో ఉంచుతారు. దీని వలన పోయిన డబ్బులు కొంతమేరకైన కాపాడుకునేవాళ్లు అవుతారు.

ఏటీఎంకేంద్రాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు..

* ఏటీఎం కేంద్రాల వద్ద నగదు డ్రా చేసే సమయంలో పక్కన కొత్త వ్యక్తులు లేకుండా చూడాలి. వారు మన పాస్‌వర్డ్‌ను చూడకుండా జాగ్రత్తగా ఉండాలి.

*బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో పక్కవారికి కనిపించేలా లావాదేవీలు చేయడం మంచిది కాదు.

*ఏటీఎంలో నగదును తీసుకోవడానికి అపరిచితుల సాయాన్ని కోరడం మంచిది కాదు. మోసం చేసే అవకావం ఎక్కువగా ఉంటుంది.

* ఏటీఎం పిన్ నంబరును తరచూ మార్పు చేసుకోవాలి. మార్పు చేసిన పిన్ నంబరు కార్డు వెనుక ఎట్టిపరిస్థితుల్లోనూ రాయకూడదు. అలా రాస్తే కార్డుపోయిన సమయంలో ఎవరైనా సులభంగా నగదును డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

2లక్షల 21వేలు పోగొట్టుకున్న కులకచర్ల వాసి

డిసెంబర్ 31న హైదరాబాద్ తన సొంత పనుల నిమిత్తం వెళ్లగా హైదరాబాద్‌లో కులకచర్ల గ్రామానికి చెందిన ఎర్ర విష్ణువర్ధన్‌రెడ్డి తన దగ్గర ఉన్న ఫోన్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొట్టేయడంతో పాటు సైబర్ నేరగాళ్ల చేతిలో ఫోన్ పడింది. అతడి ఖాతాలో ఉన్న 2లక్షల 21వేల రూపాయలు సైబర్ నేరగాళ్లు డ్రాచేశారు. వెంటనే మొబైల్ నంబర్‌ను కొత్తది తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో వెంటనే కులకచర్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

చాలా మంది సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారు...

చాలా మంది సైబర్ నేరగాళ్లు లింకులు పంపించి లింకు ఓపెన్ చేయడంతోనే డబ్బులు వారికి ట్రాన్స్‌ఫర్ అయ్యే విధంగా చూస్తున్నారు. ఇటీవల లింగంపల్లి గ్రామానికి చెందిన బాల్‌రాజ్ ఒక గ్రూప్‌లో లింక్ పెట్టడంతో ఆ లింకును ఓపెన్ చేయడంతో 30వేల రూపాయలు డ్రా కావడంతో పోలీసులను ఆశ్రయించాడు.

పశువుల సంత ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న మాజీ హోం మంత్రి మహమూద్ అలీ తదితరులు

సర్దార్‌నగర్ మార్కెట్‌ను సందర్శించిన మాజీ హోం మంత్రి మహమూద్ అలీ

షాబాద్, జనవరి 16 : సర్దార్‌నగర్ మార్కెట్‌ను రాష్ట్ర మాజీ హోం మంత్రి మహమూద్ అలీ సందర్శించారు. మంగళవారం షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహిస్తున్న పశువుల సంతను ఆయన పరిశీలించారు. అనంతరం పశువుల క్రయ, విక్రయాల గురించి అక్కడున్న సిబ్బంది, రైతులను అడిగి తెలుసుకున్నారు. పశువుల సంత గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో టెండర్ పద్ధతిలో నిర్వహించేవారని, ప్రస్తుతం రెండేళ్ల నుంచి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. పశువులు క్రయ విక్రయాలు చేసిన రైతులు, వ్యాపారుల నుంచి నూటికి ఒక్క శాతం చొప్పున డబ్బులు వసూలు చేయడం జరుగుతుందని చెప్పారు. పశువులు కొనుగోలు చేసిన రైతులకు ఆన్‌లైన్ ద్వారా రసీదు ఇస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత నిర్వహిస్తుండడంతో తమకు ఎంతో మేలు జరుగుతుందని అక్కడున్న కొంతమంది రైతులు వివరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావు, మార్కెట్ కార్యదర్శి సుజాత, రైతులు, సిబ్బంది ఉన్నారు.

జైపాల్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

ఆమనగల్లు, జనవరి16 : దివంగత కేంద్ర మాజీ మంత్రివర్యులు జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తి స్థల్ వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. వీరితో పాటు జడ్పీటీసీ పోతుగంటి భరత్ ప్రసాద్, ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

జైపాల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అనుమానం పెనుభూతమై..

భార్య తల నరికిన భర్త

వేధింపులు తాళలేక, ప్రవర్తనపై అనుమానంతో ఘాతుకం

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఘటన

ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ భీంరెడ్డి, సీఐ మన్మోహన్‌యాదవ్

పెద్దఅంబర్‌పేట, జనవరి 16: అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా వినలేదు.. సహనం కోల్పోయిన భర్త కత్తితో తల, మొండెం వేరు చేసి అతి దారుణంగా హత్య చేశాడు. భార్యకు ఇది మూడో లగ్నం అని తెలిసినా.. ఇష్టంగా పెండ్లి చేసుకుని ఆమె వేధింపులు తాళలేక ఇప్పుడు అనుమానంతో అంతమొందించాడు. ఈ దారుణ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నగరంలోని పురానాపూల్‌కు చెందిన పుష్పలత అలియాస్ సువర్ణ (42), సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు 2009లో పెండ్లి జరిగింది. పుష్పలత కంటే విజయ్ వయసులో దాదాపు ఆరేండ్లు చిన్న. విజయ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. నగరంలోని సరూర్‌నగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో వీరు నివసించారు. రెండు నెలల కిందటే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోకి మారారు. చాలాకాలంగా పుష్పలత ప్రవర్తన తీరుపై తరచూ దంపతుల మధ్య గొడవలు జరిగేవి. విజయ్ గృహ హింసకు పాల్పడుతున్నాడని, వేధింపులకు గురిచేస్తున్నాడని పుష్పలత మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై గతంలోనే కేసు సైతం నమోదైంది. పుష్పలతపై విజయ్ అనుమానం పెంచుకున్నాడు. ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గొడవలు మరింత పెరిగాయి. ఎంత నచ్చజెప్పినా ఆమె తీరు మార్చుకోకపోవడంతో మరింత కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా పుష్పలతను చంపాలని విజయ్ నిర్ణయించుకొని ప్లాన్ వేశాడు. మంగళవారం అదే కాలనీలోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలోని తన సోదరి ఫ్లాట్‌ను శుభ్రం చేసేందుకు పుష్పలతను తీసుకెళ్లాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న కత్తితో ఆమెను చంపేశాడు. కత్తితో కోసి తల, మొండెంను వేరుచేసి అతి దారుణంగా హత్య చేశాడు. ఘటనాస్థలిని వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐ మన్మోహన్‌యాదవ్ పరిశీలించారు. భర్తే చంపినట్టు ప్రాథమికంగా తెలిసిందని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నదని తెలిపారు.

ఆమెకు మూడో భర్త..

పురానాపూల్‌కు చెందిన పుష్పలతకు అప్పటికే రెండు వివాహాలు జరిగాయి. మొదటి, రెండో భర్తతో ఆమె విడిపోయినట్టు తెలుస్తున్నది. ఆమె బ్యూటీషియన్‌గా పనిచేసింది. 2009లో విజయ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడడంతో పెండ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి మరణం, తండ్రి జైలుపాలవ్వడంతో పుష్పలత హత్యతో 13 ఏండ్ల కొడుకు, తొమ్మిదేండ్ల కుమార్తె ఇద్దరు అనాథలయ్యారు. నిందితుడు విజయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

క్రీడల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడలు

కులకచర్ల, జనవరి 16 : మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. టోర్నమెంటుకు వివిధ గ్రామాల నుంచి 20జట్లు పాల్గొనగా, మొదటి బహుమతి షాద్‌నగర్‌కు చెందిన జట్టు గెలుచుకోగా 20వేల రూపాయలు, షీల్డ్‌ను అందజేశారు. రెండవ బహుమతి ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన జట్టుకు రూ.10వేలు అందజేశారు. మూడవ బహుమతి రాంపూర్ జట్టు కైవసం చేసుకున్నది. గెలుపొందిన మూడు జట్లకు నగదుతో పాటు షీల్డులను అందజేశారు. మనీప్రైజ్‌ను యాదయ్యగౌడ్ అందజేశారు. మొదటి రోజు పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి క్రీడలను ప్రారంభించగా, రెండవ రోజు కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, సీనియర్ న్యాయవాది బి వెంకట్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ బాల్‌రెడ్డి, రాంపూర్ సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ పద్మ, సీనియర్ న్యాయవాది బాలముకుందం, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ సంధ్యానంద్, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింహులు, కేయాదయ్య, నర్సింహులు, రాంజీ, శ్రీనివాస్, లక్ష్మయ్య, గోపాల్, రామచంద్రయ్య, మల్లేశ్, రాము, శంకర్, వెంకటయ్య, శ్రీనివాస్, బాలకృష్ణ, క్రీడాకారులు, పీటీలు, యువజన సంఘాల సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ప్రింటెడ్ రూపంలో ఉండాలి

నాంపల్లి కోర్టులు, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య అధికారులు, వైద్యులు.. రోగి లక్షణాలతో పాటు రాసిన మందుల పత్రాలు ప్రింటెడ్ రూపంలోనే ఉండాలని ఒడిశా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ విధానాన్ని అమలు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్యులు అందించే న్యాయపరమైన పత్రాలను పరిశీలించడం కష్టమైందని, వైద్యుల చేతిరాతను చదివేందుకు ఇబ్బందిగా మారుతున్న నేపథ్యంలో సింగిల్ బెంచ్ న్యాయమూర్తి డా.సంజీబ్ కుమార్ పాణిగ్రాహి ధర్మాసనం తీర్పును వెల్లడించింది. రసినంద బోయ్ అనే వ్యక్తి కుమారుడు పాముకాటుతో మరణించడంతో నష్ట పరిహారాన్ని అందించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్‌ను దాఖలు చేశాడు. పోస్టుమార్టం రిపోర్టును జతచేసి కోర్టుకు సమర్పించాడు. సదరు రిపోర్టును జారీ చేసిన డాక్టర్ కోర్టుకు హాజరుకావాలని నోటీసులు అందించింది. కోర్టుకు హాజరైన వైద్యుడు అందించిన వివరాల ప్రకారం సర్టిఫికెట్ వివరాలను న్యాయమూర్తి పరిశీలించారు. వైద్యుడు జారీ చేసిన రిపోర్టు చేతిరాతతో ఉండటం వల్ల అర్థం కాలేదు. చేతిరాత చదివే నిపుణులు కూడా ఈ రిపోర్టును చదువలేకపోయారని, శుభ్రంగా మొదటి ఇంగ్లిషు అక్షరాలను వాడి రిపోర్టులను రాయాలని సూచించారు. లేనిపక్షంలో కంప్యూటర్ టైపింగ్ ద్వారా ప్రింటెడ్ పత్రాలను బాధితులకు అందించడమే ఉత్తమ మార్గమని ఉత్తర్వుల్లో తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో జనవరి11, 2024 నుంచి ఈ విధానాన్ని వైద్యశాఖ అమలు చేస్తున్నది.

ఆర్టీసీకి కలిసొచ్చిన పండుగ ప్రయాణం

- గ్రేటర్‌లోనూ భారీగా పెరిగిన రాకపోకలు
- అన్ని జిల్లాలకు గ్రేటర్ నుంచి స్పెషల్ బస్సులు

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ, మహిళలకు ఉచిత ప్రయాణంతో గ్రేటర్ ఆర్టీసీకి కలిసొచ్చింది. సొంతూళ్లకు వెళ్లేందుకు మెజార్టీ జనాలు ప్రధాన బస్టాండ్లకు చేరుకునేందుకు సిటీ బస్సులను వినియోగించడం, సిటీలో ఉన్న ఆర్టీసీ బస్సులను అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కంటే ప్రయాణికుల సంఖ్య 20 నుంచి 30 శాతం ఎక్కువగా ఉందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్‌లో మొత్తం 2800 బస్సులలో రాకపోకలు సాగుతున్నాయి. పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారి కోసం గ్రేటర్ ప్రయాణికుల రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులను గ్రేటర్ ఆర్టీసీ వర్గాలు ఏర్పాటు చేశాయి. ఈ క్రమంలో 13న 700 ప్రత్యేక బస్సులు, 14న 1100 సర్వీసులు, 15న 500 సర్వీసులను ఏర్పాటు చేయడంతో ఊహించిన దాని కంటే ఎక్కువ మంది గమ్యస్థానాలకు విజయవంతంగా తీసుకెళ్లారు. 18వ తేదీన సంక్రాంతి సెలవులు ముగియనుండటంతో సొంతూళ్ల నుంచి వచ్చేవారి కోసం కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12న ఒక్క రోజే 53లక్షల మందిని సొంతూళ్లకు తీసుకెళ్లగా, గతంలో ఈ తరహాలో ప్రయాణికుల రద్దీ లేదని అధికారులు పేర్కొన్నారు.

మొదలైన తిరుగు ప్రయాణాలు..

సంక్రాంతి పండుగ ముగియడంతో సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణాలు మొదలయ్యాయి. రద్దీ నేపథ్యంలో కొంత మంది హైదరాబాద్ రావడానికి ఏర్పాట్లు చేసుకోవడంతో మంగళవారం రాత్రి నుంచే ముందస్తు బుకింగ్‌లతో పాటు, బస్టాండ్ల వద్ద రద్దీ మొదలైందని పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా సర్వీసులు అన్ని జిల్లాల నుంచి అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఈ నెల 17 నాటికి పండుగ రెవెన్యూపై సమగ్రమైన లెక్కలు పూర్తవుతాయని, గతేడాది కంటే ప్రయాణికుల సంఖ్య 20నుంచి 30శాతం పెరిగేందుకు అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అజ్మీర్ దర్గాకు ప్రత్యేక రైలు ప్రారంభం

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రా సమీపంలో ఉన్న అజ్మీర్‌దర్గా ఉర్సును పురస్కరించుకొని నగరం నుంచి వెళ్లిన భక్తులకు నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని తెలిపారు. *- మెహిదీపట్నం జనవరి 16*